Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
13-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 30

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## జగజ్జేత మన గుకేశ్

### ప్రపంచ చెస్ చాంపియన్‌గా దొమ్మరాజు గుకేశ్

18 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్

చివరి గేమ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌పై గెలుపు

ఓవరాల్‌గా 7.5%-%6.5 పాయింట్ల తేడాతో టైటిల్ కైవసం

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత ఆటగాడిగా గుర్తింపు

అద్భుతం జరగడంలో కొన్నిసార్లు ఆలస్యం కావచ్చు... కానీ అసలు సమయంలో అలాంటి అద్భుతాన్ని ఎవరూ ఆపలేరు! ఒకటి కాదు... రెండు కాదు... కనీసం మూడుసార్లు దొమ్మరాజు గుకేశ్‌కు విజయావకాశాలు వచ్చాయి... కానీ దురదృష్టవశాత్తూ త్రుటిలో అతను వాటిని చేజార్చుకున్నాడు. మరోవైపు ప్రత్యర్థి కూడా మూడుసార్లు పైచేయి సాధించి గెలుపుపై కన్నేసినా... బలంగా నిలబడ్డాడు.

2లో



## వన్ నేషన్ వన్ ఎలక్షన్

### జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైన కేంద్రం

న్యూఢిల్లీ,డిసెంబర్: జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది.

2లో



## పొరపాట్లకు తావులేకుండా సర్వే

ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి

ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం

సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం

కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్

## రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం

### లగచర్ల రైతులకు అండగా ఉంటాం

### గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని..



2లో

## కేంద్రం సాయం చేసేలా సహకరించండి

రూ.1.63 లక్షల కోట్ల ప్రాజెక్టులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సీఎం రేవంత్

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులపై చర్చ

ఆర్ఆర్ఆర్, మెట్రో ఫేజ్-2 తదితరాల ప్రస్తావన

కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్‌లతోనూ భేటీ



న్యూఢిల్లీ: తెలంగాణలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించి మొత్తం రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కిషన్‌రెడ్డితో చర్చించారు. ట్రిపుల్ ఆర్, హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2తో పాటు హైదరాబాద్, వరంగల్‌లో సీవరేజీ, భూగర్భ డ్రైనేజీ, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలను ప్రస్తావించారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై ఢిల్లీ వచ్చిన సీఎం..

2లో



## జమిలికి సై

లోక్‌సభ, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి పోలింగ్

రెండు సవరణ బిల్లులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

వచ్చేవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టే చాన్స్..

వెంటనే జేపీసీకి వెళ్తుందంటున్న బీజేపీ వర్గాలు

2 బిల్లులను పార్లమెంటు ఆమోదిస్తే చాలు.. తొలిబిల్లుకు ఉభయసభల్లో 2/3 మెజారిటీ అవసరం

స్థానిక సంస్థలను చేర్చే ఆలోచనకు విరామం

## జర్నలిస్ట్‌ను నేను కొట్టడం తప్పే

మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు

ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది

మీడియా ముసుగులో నాపై దాడికి అవకాశం ఉందని ఆలోచించా

జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నా

ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు

అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నా

కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు?

నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తా

జ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు

మరో ఆడియో వదిలిన మోహన్ బాబు

## సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

### ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్

ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ

క్యాబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం

హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది.



2లో





# పొరపాట్లకు తావులేకుండా సర్వే

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ముందు రోజు రాత్రే ప్రజలకు సమచారం ఇవ్వాలని.. స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. దరఖాస్తూల విషయంలో పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్‌లు సమీక్షించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు మంత్రి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియని.. ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నట్లు కలెక్టర్లకు మంత్రి పొంగులేని సూచించారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది. నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.

# జమిలికి సై

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే వారం మొదటి రెండు రోజుల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్‌లకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. పార్లమెంటు ఉభయ సభల్లో కేవలం సాధారణ మెజారిటీ ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును నెగ్గించుకోవాలంటే తప్పనిసరిగా అద్భుతం చేయాలి. లేదా విపక్షాల సహకారాన్ని తీసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం గురువారం నాటి క్యాబినెట్ సమావేశానికి సంబంధించి ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదు. నోట్ కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేవలం ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపుతారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపైనా స్పష్టతనివ్వలేదు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా జమిలి ఎన్నికల రూపంలోనే జరుగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకే దేశం ఒకే ఎన్నికల దిశగా ఎంతోకొంత ముందుకు వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఇందుకు జేపీసీ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో పరిశీలిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జమిలి కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా ప్రస్తుతం రెండింటికే పరిమితం అవుతున్నారు. తర్వాత దశల్లో అవి కూడా వీటికి జత చేరతాయని అంటున్నారు. తొలి బిల్లులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172(అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యుల మద్దతు అవసరం. లోక్‌సభలో మూడింట రెండు వంతులు అంటే 361 మంది సభ్యుల మద్దతు కావాలి. ఎన్డీయే కూటమి బలం 293 మాత్రమే. వైసీ పీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులు కలుపుకొని 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదని చెబుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీలకు మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించాల్సిన అవసరం ఉండదని కేంద్రం భావిస్తోంది. స్థానిక ఎన్నికలను వాటితోపాటు కలిపితే కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల్లోనైనా అమోదం పొందాల్సి ఉంటుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్టు ఈ వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలు జరపాలని, దేశవ్యాప్తంగా ఒకే ఓటర్ల జాబి తా రూపొందించాలని సిఫారసు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా చేర్చాలంటే 324(ఎ) పేరుతో ఆర్టికల్‌ను చేర్చాలని చెప్పింది. దీనికి సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం. దీన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టారు. కోవింద్ కమిటీ మూడు రాజ్యాంగ అధికరణలకు, మూడు చట్టాలకు కలిపి మొత్తం 18 సవరణలు సూచించింది. ప్రభుత్వ పాల న సాఫీగా జరగడానికి జమిలి ఎన్నికలు అవసరమని తాము భావిస్తున్నట్టు బీజేపీ చీఫ్ విఫ్ సంజ య్ జైశ్వాల్ తెలిపారు. ప్రతి కొద్ది నెలలకు ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ సమర్థత తగ్గిపోతుందని, అధికారులు, రాజకీయ నాయకులు నిరంతరం ఎన్నిక ల ప్రక్రియలో తలమునకలై ఉంటారని, సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని జైశ్వాల్ చెప్పారు. జమిలిని ప్రవేశపెడితే ఐదేళ్ల పాటు పాలన సాఫీగా సాగుతుందని ఆయన ఒక జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 1971 వరకు జమిలి ఎన్నికలు నిరాటంకంగా జరిగాయ ని, తర్వాతే వాటికి అంతరాయం కలిగింద న్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని 30కి పైగా పార్టీలు సమర్థిస్తున్నాయి. కాంగ్రెస్ సహా మరో 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మమైనది కాదని కాంగ్రెస్ అంటోంది. జమిలి ప్రజాస్వామ్య వ్యతిరేకమ ని, ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుందని, సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. జమిలిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ కూడా జమిలిని వ్యతిరేకించారు.

# జగజ్జేత మన గుకేశ్

(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్: భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ కొత్త ప్రపంచ చెస్ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. 18 ఏళ్ల వయసులోనే విశ్వ విజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో జరిగిన 14 గేమ్‌ల పోరులో గుకేశ్ 7.5%-%6.5 పాయింట్ల తేడాతో విజయం సాధించాడు. 13 గేమ్‌లు ముగిసేసరికి ఇద్దరూ 6.5%-%6.5 పాయింట్లతో సమంగా ఉండగా నిర్ణాయక చివరి పోరులో గుకేశ్ తన సత్తాను ప్రదర్శించాడు. 58 ఎత్తుల్లో లిరెన్ ఆట కట్టించి విజయనాదం చేశాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నీ గెలుచుకొని వరల్డ్ చాంపియన్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమైన రోజు నుంచి గుకేశ్‌పై అంచనాలు పెరిగాయి. నవంబర్ 25 నుంచి మొదలైన ఈ సమరంలో 9 గేమ్‌లు 'డ్రా'గానే ముగిశాయి. గురువారం చివరి గేమ్‌కు ముందు చెరో రెండు గేమ్‌లు గెలిచిన ఇద్దరూ సమంగా ఉన్నారు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే 'టైబ్రేక్' ద్వారా విజేతను నిర్ణయించాల్సి వచ్చేది. కానీ గుకేశ్ ఆ అవకాశం ఇవ్వలేదు. తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించి లిరెన్‌ను పడగొట్టాడు. తద్వారా క్లాసికల్ విభాగంలో దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ (2012) తర్వాత వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత ప్లేయర్‌గా గుకేశ్ నిలిచాడు.

**చివరి పోరు సాగిందిలా...**

తెల్లపావులతో ఆడిన 32 ఏళ్ల లిరెన్ కింగ్స్ ఇండియన్ అటాక్ ఓపెనింగ్‌తో ఆటను మొదలు పెట్టగా... గ్రన్‌ఫీల్డ్ వేరియేషన్‌తో గుకేశ్ బదులిచ్చాడు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే తన బలమైన ర్యాపిడ్‌లో గుకేశ్ ఆట కట్టించవచ్చని భావించిన లిరెన్ ఈసారి కూడా దూకుడు ప్రదర్శించకుండా రక్షణాత్మకంగా నే ఆడాడు. ఇక మరో 'డ్రా' ఖాయం అనిపించింది. ఈ దశలో లిరెన్ చేసిన భారీ తప్పిదం తన టైటిల్ కోల్పోయేలా చేసింది. తన 55వ ఎత్తులో అతను రూక్‌ను ఎఫ్2 గడిలోకి పంపించాడు. ఆశ్చర్యంతో గుకేశ్ కళ్లు ఒక్కసారిగా మెరిశాయి! కాస్త మంచినీళ్లు తాగిన అనంతరం గుకేశ్ తన ప్రత్యర్థి ఆట కట్టించేందుకు ఎన్ని ఎత్తులు అవసరమో ప్రశాంతంగా ఆలోచించుకున్నాడు. ఆపై ఎంతో సమయం పట్టలేదు. తన 58వ ఎత్తులో కింగ్‌ను ఇ5 గడిలోకి పంపడంతో లిరెన్‌కు ఓటమిని అంగీకరించడం మినహా మరో మార్గం లేకపోయింది. రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ పేరిట 39 ఏళ్లుగా ఉన్న రికార్డును భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ బద్దలు కొట్టాడు.

# కేంద్రం సాయం చేసేలా సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సాయంత్రం కిషన్‌రెడ్డితో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ భేటీల్లో ముఖ్యమంత్రితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, గడ్డం వంశీ, సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలు, ఇండ్రస్టియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్కులు, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయి. ఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయండి. మధ్య మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశాం.

# రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం

బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

# జర్నలిస్ట్‌ను నేను కొట్టడం తప్పే

హైదరాబాద్: జల్‌పల్లిలోని తన నివాసంలోకి మంచు మనోజ్ వెంట చొరబడిన జర్నలిస్ట్‌పై దాడి చేయడం తప్పేనని సీనియర్ నటుడు మోహన్ బాబు అంగీకరించారు. మంచు ఫ్యామిలీలో గత ఐదు రోజుల నుంచి వివాదం కొనసాగుతుండగా.. మంగళవారం రాత్రి గేట్లు తోసుకుంటూ తన అనుచరులు, మీడియా సభ్యులతో కలిసి మంచు మనోజ్ ఇంట్లోకి ప్రవేశించాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మోహన్ బాబు ముందు మైక్ పెట్టిన ఒక జర్నలిస్ట్.. 'ఈ ఇష్యూపై మీరు ఏం చెప్తారు?' అని ప్రశ్నించారు. దాంతో సహనం కోల్పోయిన మోహన్ బాబు.. ఆ మైక్‌ను తీసుకుని జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ తలకి గాయమై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్ట్‌పై దాడి తర్వాత మోహన్ బాబు కూడా అస్వస్థతకి గురై.. ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన మోహన్ బాబు.. ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో ఫ్యామిలీ వివాదంపై క్లారిటీ ఇవ్వడంతో పాటు జర్నలిస్ట్‌పై దాడి, దానికి గల కారణాన్ని కూడా మంచు మోహన్ బాబు వెల్లడించారు. దాడి ఘటనపై చింతిస్తున్నట్లు కూడా ఆయన చెప్పుకొచ్చారు. "మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు. ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది. మీడియా ముసుగులో నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా.. జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నాను. ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు.. అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నాను. కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు? నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తాను. నిజ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు" అని మంచు మోహన్ బాబు వెల్లడించారు. 'నా ఇంట్లోకి చొరబడి నా ప్రశాంతతని దెబ్బతీశారు.

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్

# కోర్టుకు హాజరు కాలేకపోతున్నా మరో తేదీ ఇవ్వండి

## నాగార్జున 'పరువు నష్టం కేసు'లో కోర్టుకు తెలిపిన కొండా సురేఖ



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఆర్ఎన్ఎ): సినీ నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం కేసులో తాను కోర్టుకు హాజరుకాలేకపోతున్నానని, మరో తేదీ ఇవ్వాలని తెలంగాణ మంత్రి కొండా సురేఖ కోర్టును కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను వాయిదా వేసింది. తనపై చేసిన వ్యాఖ్యలకు గాను నాగార్జున మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో మంత్రికి ఇదివరకే కోర్టు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.అయితే మంత్రిగా వివిధ కార్యక్రమాల కారణంగా సురేఖ విచారణకు హాజరు కాలేకపోతున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరో తేదీ ఇస్తే హాజరవుతారని కోర్టుకు తెలిపారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

# పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

### తమకు సమాచారం ఇవ్వకుండానే ఫైనల్ చేస్తారా?

### సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా? అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా? వేరే రాష్ట్రానికి వెళ్లారా? అని చురక అంటించారు.

# ఖమ్మంలో వృద్ధ దంపతుల హత్య మిస్టరీని ఛేధించిన పోలీసులు

**ఖమ్మం, (క్రైమ్ మిర్రర్):** ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జరిగిన వృద్ధ జంట హత్య మిస్టరీని పోలీసులు ఛేధించారు. ఓ నిందితుడి ఫోన్‌కాల్ ఆధారంగా పక్షం రోజుల వ్యవధిలోనే పోలీసులు ఈకేసులో పురోగతి సాధించారు. వృద్ధ దంపతులను బంగారం, డబ్బు కోసమే హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. జగ్గయ్యపేటకు చెందిన నేర ప్రవృత్తి కలిగిన ఓ నిందితుడితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కొత్త కొత్తూరులో 15 రోజుల కిందట వృద్ధ దంపతులు యర్ర వెంకటరమణ, కృష్ణకుమారి తమ సొంతింట్లో దారుణహత్యకు గురయ్యారు. హత్యకు సంబంధించి ఆనవాళ్లు లభించకుండా నిందితులు పక్కా పథకం ప్రకారం వ్యవహరించటంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. మూడు నెలల క్రితం వృద్ధ దంపతులు అనారోగ్యం బారిన పడి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ సమయంలో వారిని దొంగల ముఠా సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఫోన్ నంబర్ తీసుకున్నారు. కొత్త కొత్తూరులోని ఆ దంపతుల భవన సముదాయంలో అద్దెకు ఇళ్లు ఉన్నాయని తెలుసుకుని ఇద్దరు మహిళలు తరచూ అక్కడికి వెళ్లేవారు. మహిళలకు దంపతులు పలుమార్లు తమ ఇంట్లోనే భోజనం పెట్టడంతో వీరంతా కలిసిపోయారు. అతి త్వరలోనే ఇంట్లో అద్దెకు దిగుతామని వృద్ధులను నమ్మించారు. ఇందులో భాగంగానే నవంబర్ 27న రాత్రి నలుగురు వచ్చి దంపతులను మట్టుబెట్టారు. ఈ కేసును ఛేదించేందుకు సీపీ సునీల్‌దత్ ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాల్ డేటా, సీసీ కెమెరాల పరిశీలనకు ప్రత్యేక బృందాలను నియమించారు. సుమారు పది రోజుల పాటు ఎలాంటి ఆధారాలు లభించలేదు. నలుగురిలో ఓ నిందితుడు చివరగా వెంకట రమణకు ఫోన్ చేసిన నంబర్ ఆధారంగా కేసు దర్యాప్తును పోలీసులు ప్రారంభించారు. నిందితుడు తన ఫోన్‌తో పాటు మిగిలిన ముగ్గురి ఫోన్లను ఒక్కొక్కటి ఒక్కోచోట పడేయటంతో కాల్ డేటా, జీపీఆర్ఎస్‌తో మరికొన్ని ఆధారాలు సేకరించారు. మూడు ఫోన్లలో ఓ ఫోన్ నంబర్ జగ్గయ్యపేట వాసి పేరిట నమోదవటంతో పూర్తి వివరాలు రాబట్టారు. పోలీసు శాఖలో అతడిపై కేసుల వివరాలు సేకరించారు. సదరు వ్యక్తిపై 2012లో హత్య కేసు నమోదైందని తెలుసుకోవటంతో తమదైన శైలిలో దర్యాప్తు సాగించారు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నిందితులను గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశముంది.

# వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు నిరసన సెగ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు మరోసారి నిరసన సెగ తగిలింది. తాండూర్ లోని గిరిజన బాలికల వసతి గృహంలో బాలికలకు వైద్య చికిత్స పరిశీలనకు జిల్లా కలెక్టర్ వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనారోగ్యానికి గురైన బాలికలకు ఆసుపత్రిలో చికిత్స అందించాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. మూడు రోజుల క్రితం వసతిగృహంలో 16 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు.

# కోర్టులో మతపరమైన పిటిషన్ల నిరాకరణ

### మతపరమైన స్థలాలపై వ్యాజ్యాలను స్వీకరించకూడదు

### పెండింగ్ కేసులపైనా తీర్పులు ఇవ్వొద్దు!

### దిగువ న్యాయస్థానాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దేశ వ్యాప్తంగా పలుచోట్ల వివిధ ప్రార్థనా స్థలాల్లో నిర్వహిస్తున్న సర్వేలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్న తరుణంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని, అలాగే ఎలాంటి ఆదేశాలు జారీ చేయరాదని స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాల చట్టం-1991కి సంబంధించి అనుకూలంగా, ప్రతికూలంగా దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఆయనతోపాటు వివిధ పార్టీల నాయకులు జితేంద్ర అహ్వాద్, శరద్‌పవార్, మనోజ్ కుమార్ ఝా తదితరులు కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

# మోహన్ బాబు మీడియాకి క్షమాపణలు చెప్పాలి

### మోహన్ బాబు కొడుకు మీడియాను పిలిచాడు

### అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది

### మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది

### కానీ మీరే ఇంటి ఇష్యూని పబ్లిక్‌లో పెట్టేశారు

### బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మంచు ఫ్యామిలీ వివాదం గంటకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ వివాదంలోకి రాజకీయ నాయకులు ఎంట్రీ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మంచు ప్యామిలీ ఇష్యూ గురించి కీలక వ్యాఖ్యాలు. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలని సూచించారు. రాజాసింగ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.'మోహన్ బాబు మీడియాకి క్షమాపణలు చెప్పాలి. మోహన్ బాబు కొడుకు మీడియాను పిలిచాడు. అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది. మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది.. కానీ పబ్లిక్‌లో పెట్టేశారు. మోహన్ బాబుకి నా సజెషన్.. ఈ ఇష్యూని ఇలానే వదిలేస్తే చాలా పెద్దది అవుతుంది. మీరు మీడియాకి క్షమాపణలు చెప్పాలి.. గాయాలైన రిపోర్టర్‌ను వెళ్లి కలవండి' అని బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సూచించారు. మోహన్ బాబు దాడిలో గాయపడ్డ జర్నలిస్ట్ రంజిత్‌కు యశోద ఆస్పత్రిలో సర్జరీ జరిగింది. జైగోమాటిక్ బోన్‌ను వైద్యుల బృందం సరిచేసింది. కంటికి, చెవికి మధ్య మూడు లెవెల్స్‌లో ఫ్రాక్చర్లు అయ్యాయి. జైగోమాటిక్ ఎముక మూడు చోట్ల విరిగింది. ఫ్రాక్చర్లు అయిన చోట సర్జరీ చేసి.. స్టీల్ ప్లేట్ అమర్చారు యశోద ఆస్పత్రి వైద్యులు. రంజిత్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు చెబుతున్నారు. అటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మోహన్ బాబు.. డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్న మోహన్‌బాబుకు.. వైద్యులు చికిత్స అందించారు. అటు మోహన్ బాబుపై పహాడీ షరీఫ్ పోలీసులు అటెంప్ట్ కేసు నమోదు చేశారు. ఓ టీవీ ఛానెల్ ప్రతినిధిపై దాడి ఘటనలో మోహన్ బాబుపై మొదట బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుపై లీగల్ ఒపీనియన్ తీసుకున్న తెలంగాణ పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో కాస్త ఊరట లభించింది. పోలీసుల ఎదుట విచారణ నుంచి మినహాయింపు ఇస్తూ.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంచు కుటుంబ వ్యవహారం, మీడియాపై మోహన్ బాబు దాడి ఘటనపై విచారణకు హాజరుకావాలని రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. మీడియాపై దాడికి సంబంధించి మోహన్ బాబుపై కేసు కూడా నమోదైంది. అయితే.. పోలీసుల నోటీసులపై మోహన్ బాబు హైకోర్టును ఆశ్రయించారు. మంచు ఫ్యామిలీ వివాదం నడుస్తున్న నేపథ్యంలో.. సోషల్ మీడియాలో మంచు లక్ష్మి మరో పోస్ట్ చేశారు. ప్రపంచంలో ఏదీ మీది కానప్పుడు.. ఏం కోల్పోతారని భయపడుతున్నారంటూ ట్వీట్ చేశారు. మోహన్ బాబుపై కేసు నేపథ్యంలో మంచు లక్ష్మి పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ పోస్టు చేశారనే చర్చ జరుగుతోంది.

# కేసీఆర్ నాయకత్వంలోనే బయ్యారం ఉద్యమం

### అక్కడ పరిశ్రమను ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి : కవిత

హైదరాబాద్,డిసెంబర్ 12 (ఆర్ఎన్ఎ): బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు.

# ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

### ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతుందని, కావల్సింది ప్రకటనలు కాదని పథకాలని అవి గుర్తుపెట్టుకుంటే మంచిదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొటారన్నారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరెంట్, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.

# జైలులో గుండెపోటుకు గురయిన లగచర్ల రైతు

### బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

### తెలంగాణ పోలీసులు మరో దారుణం

### ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ

### ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం

### ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
ఎడిటోరియల్
4
శుక్రవారం
13-12-2024

## ఎడిటోరియల్



# ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ షురూ..

### ఏఐ, డీప్ టెక్‌లతో పౌర సేవలు నిర్వహణ

అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ కోవకే చెందిన వార్త ఇది. ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వాట్సాప్ ద్వారా పౌర సేవలు వేగంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మనం ప్రతీ సమాచారాన్ని పొందడానికి, చేరవేయడానికి వాట్సాప్‌ను ఎలా వినియోగిస్తున్నామో, ఇక ప్రభుత్వం కూడా మనకు అవసరమైన సేవలు వాట్సాప్‌లో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఇకపై వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్ అంటూ తాజాగా ప్రకటించింది కూడా. పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం అవసరమని, విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం.సమర్ధవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కూడా బాధ్యతలు ఫిక్స్ చేసారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు సీఎం అనుమతిచ్చారు. వీలైనంగా త్వరగా గ్రామ %-% వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. ష్ట్రంలో జనన %-% మరణ ధృవపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

# కాలం తాకిడిలో సోషలిజం స్ఫూర్తి..



దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు రాజ్యాంగ వత్రోత్సవం ముందురోజైన నవంబర్ 25న ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని చెప్పాలి. రాజ్యాంగం అవతారిక (ప్రియాంబుల్)లో 42వ సవరణ ద్వారా చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలంటూ దాఖలైన కేసును కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో.. ఆ రెండు పదాల స్ఫూర్తిపై గత కొంత కాలంగా కొందరు చేస్తున్న అసంబద్ధ వాదనలను, వారు వ్యాప్తి చేసిన అయోమయాన్ని పటాపంచలు చేసినట్లయింది. దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అని, కొన్ని మతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 'సెక్యులర్' అని పేర్కొనడం హిపోక్రసీ (కపటత్వం) అని కొందరి వాదన. అందువల్ల ఆ రెండు పదాలను తొలగించాలంటూ 2020లో సుప్రీం కోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానికి అనుబంధంగా మాజీ రాజ్యసభ సభ్యులు సుబ్రమణ్యస్వామి కూడా మరొక దావా వేశారు. ఈ రెండింటిని కలిపి విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం సరైన సమయంలో సరైన తీర్పును ఇచ్చింది. తెలుగులో స్వామ్యవాదంగా పేర్కొనే సోషలిజం పెట్టుబడిదారీ విధానానికి పూర్తి వ్యతిరేకమని చాలామంది భావన. పెట్టుబడిదారీ విధానంలో సామాన్యులు నష్టపోతారని, సంపన్నులకే లాభం అని, అదే సోషలిస్ట్ సమాజంలో అయితే వర్గ విబేధాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని అనేక సంవత్సరాలపాటు ప్రచారం జరిగిన మాట నిజం. నిజానికి 'సోషలిజం' కు విస్తృతార్ధం ఉంది. దానిని గ్రహించలేనివారు దానిని తప్పుగా అన్వయించుకొని ఆ పదాన్ని, అదేవిధంగా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు సోషలిజం లేదా సోషలిస్ట్ అనే పదాల విస్తృతార్ధాన్ని చక్కగా విడమర్చి వివరిస్తూ.. "సంక్షేమ రాజ్యానికి కట్టుబడి ఉండటం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం సోషలిజం విధానంగా చూడాలి. రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదం ఉన్నంత మాత్రాన ఏదో ఒక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని నిర్దేశించడం కాదు" అని చెప్పారు. సోషలిజం అనే భావనను చాలామంది పొరపాటుగా అర్థం చేసుకోవడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఆర్థిక విధానాన్ని పెట్టుబడిదారీ విధానంగా, సోవియట్ రష్యా అనుసరించిన విధానాన్ని సోషలిస్ట్ విధానంగా పిలుచుకోవడం జరిగింది. 20 శతాబ్ది ప్రథమార్ధంలో, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్తోసహా ప్రపంచంలోని అనేక దేశాలు పలు పోరాటాలు చేశాయి. వర్ణవివక్ష, అణచివేత, హక్కుల ఉల్లంఘన, ఆర్థిక దోపిడీకి పాల్పడిన బ్రిటీష్ పాలకుల విధానాలను ఒక్క భారత్లోనే కాదు.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు అనేకం తీవ్రంగా వ్యతిరేకించాయి. అదే సమయంలో సోవియట్ రష్యాలో కార్మికవర్గం సంఘటితమై జరిగిన విప్లవం ఈ దేశాలకు స్ఫూర్తి నందించాయి. పేదరికం, పీడన, బానిసత్వం వదిలించుకోవడానికి ఉద్యమాలే మార్గంగా భావించి ఆ బాటనే పట్టాయి. రెండవ ప్రపంచయుద్ధంలో 'ఫాసిజం' ఓటమి చెందడంతో సోవియట్ రష్యా అనుసరించే సోషలిస్ట్ నమూనాకు తృతీయ ప్రపంచ దేశాలో సానుకూలత వ్యక్తం అయింది. అదొక ఆదర్శవాద విధానంగా చూడబడింది. ఆ సమయంలోనే దేశంలో ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తులు, పార్టీల కారణంగా పలు రకాల విధానాలు, పద్ధతులు కలగలిసినప్పటికీ ప్రధానంగా స్వామ్యవాద భావనలు, స్వామ్యవాద విలువలే ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించాయి. జాతీయతా భావన అందరిలో పెల్లుబుకింది. స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమిక వహించిన కాంగ్రెస్ పార్టీ 1931లో చేసిన కరాచీ రిజల్యూషన్లో చాలా స్పష్టంగా తమ విధానాన్ని ప్రకటించింది. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వానికి కట్టుబడి పని చేస్తామని తీర్మానించింది. స్వతహాగా సోషలిస్ట్ భావాలు గలిగిన డా? బి. ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత స్వీకరించిన సందర్భంలో "దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోషలిజం నిజమైన ఔషదాన్ని అందించగలదు" అని అన్నారు. రాజ్యాంగసభలో జరిగిన వాడివేడీ చర్చల సందర్భంగా డా? బి.ఆర్. అంబేద్కర్ తన వాదన వినిపిస్తూ "ఆర్థిక విధానం ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వకుండా భవిష్యత్ తరాల చేతులు కట్టేయడం సరికాదు" అని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేయడం అనే లక్ష్యం సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం ద్వారానే నెరవేరుతుంది కనుక ప్రత్యేకంగా 'సోషలిస్ట్' పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చలేదు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చొరవతో పార్లమెంట్ రాజ్యాంగానికి 42వ సవరణ చేసి రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చారు. ఆ సవరణ జరిగిన 44 సంవత్సరాల తర్వాత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిజం పదాలను చేర్చడాన్ని తప్పుపడుతూ 2020లో సుప్రీం కోర్టులో కేసు వేయడంతోనే మళ్లీ 'సోషలిజం' స్ఫూర్తిపై గత 4 ఏళ్లుగా చర్చలు, వాదోపవాదాలు చోటు చేసుకొన్నాయి.

ప్రముఖ న్యాయవాది నానీఫాల్కివాలా మన దేశంలో 'సోషలిజం' తప్పుగా బ్రాండ్ అయింది అని అన్నారు 1972లో. దేశంలోని పేదరికాన్ని సమానంగా పెంచడమే 'సోషలిజం'గా చెలామణి అవుతోందని వెటకారంగా అన్నారు. 'గరీబీ హటావో' (పేదరికాన్ని పారద్రోలాలి) అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే.. కొందరు అమీరీ హటావో (సంపదను పారద్రోలాలీ) అని అర్థం చేసుకొంటున్నారని నానీఫాల్కీవాలా చమత్కరించారు. దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దేశంలో 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'కు బాటలు పర్చినప్పటికీ దశాబ్దాలపాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నామమాత్రంగానే పెరిగింది. నెహ్రూ అనుసరించిన విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయిన తర్వాత ఒకరు చైనా నమూనాను, మరొకరు సోవియట్ రష్యా నమూనాను సమర్థించారు. సోషలిజం విధానమే ఆదర్శప్రాయమైందన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. 'సోషలిజం' పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమని.. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదవాళ్ల శ్రమ దోపిడీకి గురవుతుందని బలమైన ప్రచారం జరిగింది. పరిశ్రమలన్నీ పెట్టుబడిదారీ యాజమాన్యం నుంచి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావడమే సంపూర్ణ సోషలిజం లక్ష్యం అనే నినాదాలు దేశంలో చాలా కాలం విన్పించాయి. పరిశ్రమల్ని జాతీయం చేయాలని కొందరు కమ్యూనిస్టులు తరచుగా పిలుపునిచ్చేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించేవారందరూ అభ్యుదయ వాదులుగా పిలవబడ్డారు. సంపన్నులంతా దుర్మార్గులని, సామాన్యులు మంచివారనే నెరేటివ్లతో మెజార్టీ నవలలు, సినిమాలు కూడా వచ్చాయి. దీంతో సామాన్య ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి. అయితే, ఒక్క తూటా పేలకుండా, ఏ ఒక్క వ్యక్తి మరణించకుండా ఎప్పుడైతే సోషలిస్ట్ సోవియట్ యూనియన్ తనకుతానుగా కుప్పకూలిందో, అప్పట్నుంచీ సోవియట్ రష్యాలో అమలైన 'సోషలిజం' విధానాలకు నిజమైన అర్థమేమిటన్న అంతర్మథనం భారత్తో సహా చాలా దేశాలలో మొదలయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ఆ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని లోపాలు అంతర్జాతీయ సమాజానికి వెల్లడయ్యాయి. దాంతో, ఏ దేశమూ తనకున్న పరిమిత ఆర్థిక వనరులతో పైకెదగలేదనిబీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం అనివార్యం అని చాలా దేశాలు గ్రహించాయి. భారత్కు సంబంధించినంతవరకు 1991లో మొదలైన మొదటి దశ ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా పని చేశాయి. అప్పటివరకు దేశంలో రాజ్యమేలిన లైసెన్స్ రాజ్కు మంగళం పాడి.. ప్రజలందరికీ సమాన అవకాశాలను పొందే విధంగా అనేక రంగాల ద్వారాలను తెరవడం జరిగింది. దాంతో ప్రజలకు నిత్యావసరాలుగా మారిన వంటగ్యాస్, టెలిఫోన్ సౌకర్యం వంటివి సామాన్యులకు సైతం దక్కాయి. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడి పరుగుపెట్టింది. దేశంలోకి పెట్టుబడులు రావాలని, పరిశ్రమల స్థాపన జరగాలని, దేశ సంపద పెరగాలని, పెరిగిన సంపద అన్ని వర్గాలకు చేరాలని.. అదే భారత రాజ్యాంగం ప్రవచించిన ఆర్థిక,సామాజిక న్యాయం అని పాలకులకు అర్థం అయింది. కనుకనే, దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తమకు అధికారం ఇస్తే ఆ పంథానే అనుసరిస్తామని ఎన్నికలలో హామీలిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలు హామీ ఇచ్చిన విధంగానే సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వడంలో ఇంకా తాత్సారం చేస్తున్నాయి. నానా ఫాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను అందిస్తుంది. అవి దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని లభించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగి సంపూర్ణ సోషలిజం అమలవుతుంది.

# విజయోత్సవాలు ముగిశాయి...హామీల సంగతేంది!

రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుని ఘనంగా విజయోత్సవ సంబరాలు చేసుకుంది. ఇందులో తప్పు పట్టవలసినది ఏమీ లేదు. ఐతే, విజయోత్సవాలు జరుపుకునే సందర్భంలో తాము ఏం సాధించాం అనేది చెప్పడం సంప్రదాయం. ఈ సంవత్సర కాలంలో ఏమైనా పొరపాట్లు చేశామా, తప్పడు నిర్ణయాలు తీసుకున్నామా అని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సందర్భం కూడా ఇదే. అయితే అధికార పార్టీలు సత్సంప్రదాయన్ని పాటించటం లేదు అనేది నిజం. పాలక పార్టీలు బలహీనపడడానికి కారణం కూడా ఇదే. ఇందుకు బీఆర్ఎస్ ఓటమే ఒక పెద్ద ఉదాహరణ. అధికారంలో ఉన్నపుడు ఆత్మపరిశీలన చేసుకొని ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్లి వుంటే అంత సులభంగా ఓడిపోయేది కాదేమో. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో కొన్ని వాగ్దానాలు చేసింది. గెలిచిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు చేయడానికి నానా తంటాలు పడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మీద వడ్డీలు కట్టడం, అలాగే అప్పులో కొంతభాగం తీర్చడంలో ఆర్థిక వెసులుబాటు లేకుండా పోయింది. రైతాంగం అప్పలు మాఫీ చేయడానికి ఎంత ఇబ్బందిపడ్డారో చూసాం. ఈ రుణ మాఫీ సైతం రైతులు అందరికీ చేయలేకపోయారు. ఇక కౌలు రైతుల రుణాల సమస్య తీవ్ర సవాలుగానే ఉంది. కాంగ్రెస్ ఏడాది పాలనలో కౌలు రైతులు కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాబట్టి, రైతుల దురవస్థలను తొలగించాల్సింది ప్రభుత్వమే.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగానే అమలు చేస్తోంది. గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ సరఫరా చేస్తున్నారు, ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించి పరిమితిని పదిలక్షలు చేసారు. అందరికీ నాణ్యమైన వైద్యం ప్రభుత్వ రంగంలో అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వం తనకు తాను కొన్ని సమస్యలను సృష్టించుకుంటున్నది.

పారిశ్రామికీకరణలో భాగంగా అమెరికా వెళ్ళి పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపింది. చాలా ఉత్సాహంగా ముందుకు వచ్చాయి ఫార్మా కంపెనీలు. కాని ప్రపంచంలో చాలా దేశాలు ఈ పరిశ్రమను వదులుకుంటున్నాయి. మందుల ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఫార్మా పరిశ్రమలు విసర్జించే వ్యర్థ, విష పదార్థాలు పర్యావరణ భద్రతకు హాని చేకూర్చేవి. జల, వాయు కాలుష్యాలు సరేసరి. అందుకే సంపన్న దేశాలు ఆ పరిశ్రమలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలిస్తున్నాయి. కనుకనే భారత్ లాటి వర్ధమాన దేశాలు అడిగనదే తడవుగా చాలా పెద్ద ఎత్తున వస్తాయి. ఈ పరిశ్రమ అనుభవం దాని పర్యవసానం మన పటాన్‌చెరువు ప్రాంతాన్ని చూస్తే అర్థమవుతుంది. . అలాగే ఇంధన సమృద్ధిని సమకూర్చుకోవడానికి ఇథనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంట్లో భాగంగా తెలంగాణలో ఇలాంటి ముప్పై పరిశ్రమలు పెట్టాలనుకుంటున్నారు. రాష్ట్ర పాలకులు ఈ నిర్ణయాలు అమలు చేసేముందు నారాయణపేట జిల్లా చిత్తనూరు వెళ్ళి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు చూస్తే ఫార్మా పరిశ్రమను ప్రోత్సహించరు. మనం మన అనుభవాల నుండి ఎందుకు నేర్చుకోవడం లేదనేది ఒక చిక్కు ప్రశ్న.ఏ సమాజ అభివృద్ధికైనా విద్య, వైద్యం చాలా కీలకమైనవి. బీఆర్ఎస్ సర్కార్‌ని ఏ తప్పుకు అయినా క్షమించవచ్చు కాని విద్యారంగ విధ్వంసం విషయంలో క్షమించడం చాలా కష్టం. తెలంగాణలోని ఏ విశ్వవిద్యాలయం గురించీ ఇప్పుడు గర్వంగా చెప్పుకోలేం. ఒకనాడు ఉస్మానియా విశ్వవిద్యాల యం దేశంలో అత్యంత ప్రతిష్ఠ గల ఐదారు విశ్వవిద్యాలయాలలో ఒకటి. బీఆర్ఎస్ ఎందుకు విద్యను ఇంత నిర్లక్ష్యం చేసిందో అర్థం కాదు. ఆ పార్టీ ఓటమికి అదొక బలమైన కారణం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తూనే విద్యావేత్తలు కలిసి ఈ సమస్యను ప్రస్తుత ప్రభుత్వానికి చాలా విపులంగా చెప్పారు. విద్యకు తమ మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన మేరకు 15శాతం బ్జడెట్‌లో కేటాయించాలని కోరారు. మరి 2024?25 వార్షిక బ్జడెట్‌లో గత బ్జడెట్ కంటే కేవలం 0.7శాతం మాత్రమే పెంచారు. విద్యా కమిషన్ నొకదాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెప్పింది. ఎట్టకేలకు నియమించింది.

# బొంరాస్ పేటలో అర్బన్ పార్క్... ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉంది...!

## వర్షాకాలానికి చందనం మొక్కలను పెంచి.. రైతులకు అందేవిధంగా చూడాలి...!

## కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చార్మినార్ సర్కిల్ చీఫ్ ప్రియాంక వర్గీస్...!

**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** బొంరాస్ పేట్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం అర్బన్ పార్క్, ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉందని, ఈప్రాంతంలో అర్బన్ పార్క్,ఎకో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చార్మినార్ సర్కిల్ చీఫ్ ప్రియాంక వర్గీస్ అన్నారు.గురువారం ఆమె వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట్ రిజర్వ్ ఫారెస్ట్,కొత్తూరు సెంట్రల్ నర్సరీ,కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ లను సందర్శించారు. అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ అభివృద్ధితో పాటు,పక్కనే ఉన్న బొంరాస్ పేట్ చెరువులో వాటర్ స్పోర్ట్స్ ప్రతిపాదనలు కూడా అవసరమని అధికారులకు సూచించారు. అనంతరం సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు సెంట్రల్ నర్సరీని సందర్శించి, ఆ నర్సరీలో రాబోయే వర్షాకాలానికి చందనం మొక్కలను పెంచి, రైతులకు అందేవిధంగా చూడాలని ఆదేశించారు.ప్రజలకు ఉపయోగపడే మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని,నర్సరీ స్థాయిని మరింతగా పెంచాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, రంగురంగుల బోగం విలియం మొక్కలను నాటడం ద్వారా రోడ్డుకు ఇరువైపులా మరింత అందాన్ని చేకూర్చాలని హెచ్ఎండిఏ అధికారులకు సూచించారు.అనంతరం కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ లో చేపట్టిన ప్లాంటేషన్ను సందర్శించి, పరిశీలించారు. సరైన అటవీ మొక్కలను మంచి ఎత్తులో ఉన్న మొక్కలను నాటాలని హెచ్ఎండి అధికారులను ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, జ్ఞానేశ్వర్ డిఎఫ్,వికారాబాద్ అటవీ అధికారులు,కొడంగల్ పురపాలక కమిషనర్ బలరాం నాయక్,ఇతర సిబ్బందితో



సమావేశమై కొడంగల్ లోని వివిధ అటవీ శాఖ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ పర్యటనలో కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సవిత, వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్,సెక్షన్ ఆఫీసర్లు,బీట్ ఆఫీసర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-12-2024







## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

### మున్సిపల్ చైర్మన్ - వెన్ రెడ్డి రాజు

**చౌటుప్పల్, డిసెంబర్ 12 (క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలోని గల తంగడపల్లిలో డాక్టర్మస్కు మధుసూదన్ రెడ్డి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలోముఖ్యమంత్రి కప్-2024 మండల స్థాయి క్రీడోత్సవాల కార్యక్రమాన్ని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థి దశ నుండి క్రీడల్లో పాల్గొనడంతోటి విద్యార్థులకు మంచి నైపుణ్యతతో పాటు ఆరోగ్యం కుదుటపడనికి క్రీడోత్సవాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రీడోత్సవాలలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కప్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. మున్సిపల్, మండల పరిధిలోని విద్యార్థులు అందరూమండల స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో గెలుపొంది మీరు మీ సత్తా చాటాలని అన్నారు. విద్యార్థులకు భోజన సౌకర్యం, జిల్లాస్థాయిలోకి వెళ్లడానికి బస్సు సౌకర్యం చైర్మన్ కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహా రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మండల విద్యాధికారి గురువా రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్స్ బండమీద మల్లేష్, ఆలే నాగరాజు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి కృష్ణ చైతన్య కు సన్మానం



**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి చౌటుప్పల్:** ఇటీవల జరిగిన చౌటుప్పల్ మండలం యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన ముప్పిడి కృష్ణ చైతన్య గౌడ్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, మిత్రులు పాల్గొన్నారు.నా ఎన్నిక కు సహకరరించినా అందరికి పేరు పేరు నా ధన్యవాదములు ముప్పిడి కృష్ణ చైతన్య తెలిపారు.



## వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో నిరుపేదలకు వైద్యం అందించాలి

### నిరుపేదల కు తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్యం అందించాలి: డాక్టర్ సుబ్బారావు

**కోదాడ డిసెంబర్ 12 క్రైమ్ మిర్రర్ :**

వైద్యం నిమిత్తం హాస్పిటల్ కి వచ్చే నిరుపేదలకు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యం నిర్వాహకులు అందించాలని కోదాడ ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు అన్నారు గురువారం పట్టణంలోని స్థానిక ఆజాద్ నగర్ సూర్య ల్యాబ్ దగ్గర కేపీ కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన రాకేష్ డెంటల్ హాస్పటల్ ను నిర్వాహకులు కే జోసఫ్, డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి డాక్టర్ సుబ్బారావు, టీజీ పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్ పాల్గొని హాస్పటల్ ను ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ కోదాడ పట్టణం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో కోదాడ పట్టణంలో అధునాతన పరికరాలతో రాకేష్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు కోదాడ ప్రాంత ప్రజలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన హాస్పిటల్స్ సేవలను సద్వినియోగం చేసుకొని పళ్ళ సమస్యలను లేకుండా మంచి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని తెలిపారు, హాస్పటల్ ఈ కార్యక్రమములో కోదాడ వైద్యులు సూర్యనారాయణ, శ్రీనివాసరావు సురేష్ కుమార్, శ్రావణ్ కుమార్, కోదాడ మాజీ సర్పంచ్ వెర్నేని బాబు కాంగ్రెస్ జిల్లా నాయకులు పార,సీతయ్య, కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు వార్డు కౌన్సిలర్లు గుండెల సూర్యనారాయణ, గంధం యాదగిరి వివిధ పార్టీలకు చెందిన నాయకులు ,కోదాడ ప్రాంత పాస్టర్లు, శ్రేయోభిలాషులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు

## దొడ్డు కొమురయ్య ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలి

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్ కురుమ

**గండిపేట్(క్రైం మిర్రర్):** కోకాపేట్‌లో ఈ నెల 14వ తేదీన దొడ్డు కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్ కురుమ కోరారు. గురువారం బండ్లగూడ సంధ్యానగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోకాపేట్‌లో కొత్తగా నిర్మించిన భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ప్రతినిధులు కురుమ సంఘం రాష్ట్ర జిల్లాల, మండలాల నాయకులు హాజరవుతారన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పెద్ద ఎత్తున ప్రారంభోత్సవానికి తరలివెళదామని పిలుపునిన్నారు. ప్రతి గడప నుంచి కులస్తులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు అనంతరాజు, లక్ష్మణ్, మనోహర్, మల్లేష్, పి.రమేష్, ఆంజనేయులు, విజయ్, కృష్ణయ్య, మల్లేశం, సత్యనారాయణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.





## ఇంటిని కాల్చిన దీపం

### ఇరుముడి పూజలకు వెళ్ళగా కాలిన ఇల్లు..

**కోదాడ డిసెంబర్ 12 క్రైమ్ మిర్రర్:** అయ్యప్ప మాల వేసుకున్న వ్యక్తి పూజ కోసం ఇంటిలో వెలిగించిన దీపంఅంటుకొని ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన కోదాడలోని సాయి నగర్ లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా నివాసం ఉంటున్న తోగరు సైదయ్య అయ్యప్ప మాల ధరించాడు. కాగా గురువారం ఇంట్లో పూజ చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఇరుముడి పూజకు సూర్యాపేట వెళ్ళారు. కాగా దీపం అంటుకొని ఇల్లు కాలి పోయింది. సుమారు 30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని భాదితులు వాపోయారు.కాగా ఇల్లు కాలి పోతున్న విషయం గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం యిచ్చారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. కాగా ఇంటి యజమాని తోగరు సైదయ్య కోదాడ లోని శ్రీరాం చిట్స్ మేనేజర్ గా పని చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి

### రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు





**బాన్సువాడ:క్రైమ్ మిర్రర్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు.గురువారం బాన్సువాడ పట్టణ కేంద్రంలో సీఎం కప్ క్రీడాల పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికిదీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందని,క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ చైర్మెన్ గంగాధర్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్,అంజిరెడ్డి,కామారెడ్డి యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిల్లర్లు నంద కిశోర్,రుక్మిణి,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్సూర్,బారి,ప్రభుత్వ అధికారులు,ఆయా పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని క్లాస్ నుండి బహిష్కరించిన యాజమాన్యం..

### యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...

### ఎన్ ఎస్ యు ఐ నాయకులు గొల్ల జాన్...



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12 (క్రైమ్ మిర్రర్):** కొంపెల్లిలోని ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్‌లో అయ్యప్ప మాల వేసుకున్నాడని క్లాస్ రూమ్‌కి అనుమతించకుండా ఇంటికి పంపిన సిబ్బంది, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్డిమాండ్ చేశారు. సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ కొంపల్లి మునిసిపల్ పరిధిలో అయ్యప్ప మాల ధారణ విద్యార్థి అవమానించారని అన్నారు.ఢిల్లీ వరల్డ్ స్కూల్ ,కొంపల్లి లో ఉన్న విద్యార్థి అయ్యప్ప స్వామి దీక్ష వహించి స్కూల్ కి వస్తే ఆ విద్యార్థి ని తరగతి గదిలో కాకుండా లైబ్రరీలో కూర్చో పెట్టారని అసహనం వ్యక్తం చేశారు. రేపటి నుండి దీక్షా వస్త్రాలతో స్కూల్ కు రావద్దని సర్క్యులర్ జారీ చేసిన ఢిల్లీ వరల్డ్ స్కూల్ యాజమాన్యం జారీ చేశారని అన్నారు.ఆ విద్యార్థి తండ్రి తో ఫోన్ లో మాట్లాడిన ఫోన్ కాల్ రికార్డింగ్ సోషల్ మీడియా లో చక్కర్లుకడుతుందని అన్నారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ మేనేజ్మెంట్ ప్రవర్తనకు వ్యతిరేకంగా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు స్కూల్ ముందు నిరసనకు దిగారు. యాజమాన్యం దిగివచ్చి క్షమాపణ లేఖ ఇచ్చింది. ఇకపై పాఠశాలలో ఇలాంటివి జరగవని యాజమాన్యం తెలిపిందని అన్నారు.

# కోదాడ ప్రభుత్వ హాస్పటల్ 100 పడకల నిర్మాణం వెంటనే చేయాలి

## అని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకులు బెజవాడ శ్రవణ్ మరియు కోదాడ మున్సిపల్ కౌన్సిలర్ బెజవాడ శిరీష శ్రవణ్



**కోదాడ డిసెంబర్ 12 క్రైం మిర్రర్** కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బెజవాడ శ్రవణ్ , కార్యకర్తలు , అందరూ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా నిరసన తెలపడం జరిగింది,. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా బెజవాడ శ్రవణ్ గారు మీడియా ముఖంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కేసిఆర్ మీద తిట్లు దేవుడి మీద ఒట్లు ఇచ్చిన హామీలకు తూట్లు అన్న సంకల్పంతోనే నడుస్తుందని పేద ప్రజల ఆరోగ్యం ఆరోగ్య సదుపాయాల మీద పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కోదాడ పరిసర ప్రాంతంలో లక్షల మంది ప్రజలకు కోదాడ ప్రభుత్వాసుపత్రి పెద్దది ప్రతిరోజు ఈ ప్రభుత్వాసుపత్రికి 500 మంది చికిత్స నిమిత్తం వైద్య సదుపాయాలు కోసం వస్తుంటారు అందుకే గత ప్రభుత్వం లో శాసనసభ్యులుగా ఉన్న బొల్లం మల్లయ్య యాదవ్ గారి చొరవతో కేసీఆర్ గారు కోదాడలో ముప్పై పడకల హాస్పిటల్ ని 100 పడకల హాస్పటల్గా అభివృద్ధి చేస్తూ 29 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు . ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నెలలోపే కోదాడ గవర్నమెంట్ హాస్పిటల్ కు ముగ్గురు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర్ , తుమ్మల నాగేశ్వరావు గారు వచ్చి కేసీఆర్ గారు ఇచ్చిన 29 కోట్ల రూపాయలతో కేవలం ఒక శిలాఫలకం వేసి కోదాడ వంద పడకల హాస్పిటల్ నిర్మాణ పనులుకు ఈ 10 నెలల కాలంలో తట్టెడు మట్టి కూడా పోయకుండా దుర్మార్గపు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు . కోదాడ 100 పడకల హాస్పటల్ నిర్మాణ పనులు ఏమోగానీ ఇప్పుడున్న 30 పడకల హాస్పిటల్ లో ఉండాల్సిన 16 మంది డాక్టర్లకు ముగ్గురు డాక్టర్లు మాత్రమే ఉన్నారు అలాగే అల్ట్రా సౌండ్ స్కానింగ్ టెక్నీషియన్ లేరు ఫార్మసిస్టు ఒక్క ఫార్మసిస్టు తోనే హాస్పిటల్ నడిపిస్తున్నారు అలాగే ల్యాబ్ టెక్నీషియన్ కొరత ఉంది హాస్పటల్లో పూర్తిగా సిబ్బంది కొరత కూడా ఉందనే విషయాన్ని హాస్పటల్ సూపర్డెంట్ దశరథ్ నాయక్ గారికి వివరించగా వెంటనే దశరథ నాయక్ గారు తెలంగాణ వైద్య విధాన పరిషత్తుల లేఖ రాసిన కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా దుర్మార్గపు ప్రవర్తన కోదాడలోని చోటు చేసుకుంది.గత ప్రభుత్వంలో గర్భిణీ స్త్రీలకు ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో 50 ప్రసవాలు జరిగేవి కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేవలం 16 ప్రసవాలు మాత్రమేజరుగుతున్నాయి దానికి కారణం ప్రసూతి వైద్య నిపుణులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయటమే అలాగే ఆపరేషన్లు చేయటానికి మత్తు డాక్టర్ లేకపోవటం ఒక కారణం అలాగే గత ప్రభుత్వంలో గర్భిణీ స్త్రీలు మగ బిడ్డ ప్రసవిస్తే పదివేల రూపాయలు ఆడబిడ్డ ప్రశ్నిస్తే 11 వేల రూపాయలు కేసీఆర్ కిట్టు అలాగే న్యూట్రిషన్ కిట్టు ఇచ్చి వాళ్లని హాస్పటల్ నుంచి ఇంటిదాకా చరవేసేది కూడా ప్రభుత్వ హాస్పటల్ వాహనంలోనే. ఇప్పుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పథకాలాన్ని అటకెక్కాయి.మొన్న వర్షాకాలంలో వర్షం ప్రభావం వల్ల కోదాడ నియోజకవర్గంలో డెంగ్యూ మలేరియా చికున్ గున్యా లాంటి విష జ్వరాలు వచ్చి పేద ప్రజలు కొట్టుమిట్టాడారు వైద్య సేవల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే సరైన సదుపాయాలు లేక ప్రైవేట్ హాస్పిటల్ కి పోయి లక్షల రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ హాస్పటల్లో చెల్లించి ప్రాణాలు రక్షించుకున్నారు. కాబట్టి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గారడి మాటలు మూటలు మోసే మాటలు బంద్ చేసి ప్రజా సంక్షేమం వైపు మొగ్గు చూపాలి , పేద ప్రజల ఆరోగ్యం వైద్యసదుపాయాలు మీదా దృష్టి సారించాలి . ఈ ప్రభుత్వంలో కోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారు గెలిచిన 3 నెలలకే కోదాడ అభివృద్ధి కోసం 300 కోట్లు ఆరునెలల్లో 600 కోట్లు సంవత్సరంగా పనులు కాకపోయినా సంబరాలు చేసుకుని 1000 కోట్లు అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు ఆ పనులు కేవలం శిలాఫలకాల దగ్గర ఆగిపోయాయో లేక పనులు జరుగుతున్నాయో కోదాడ ప్రజలకు తెలియదు గానీ కోదాడ ప్రభుత్వ హాస్పటల్లో వంద పడకల నిర్మాణం కోసం కేసీఆర్ పంపించినటువంటి 29 కోట్ల రూపాయల నిధులు తప్పనిసరిగా వంద పడకల హాస్పటల్ నిర్మాణానికి ఖర్చుపెట్టి పేద ప్రజల ఆరోగ్యం వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ కౌన్సిలర్ బెజవాడ శిరీష శ్రవణ్ , కోదాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు కుడుముల రవి , చింతా కుమార్ , కోదాడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు గుడాల శిరీష శ్రీను , ప్రతిమ , మరియమ్మ , కోదాడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు పంది వేణు , కుడుముల ఉపేందర్ , రాయల తరుణ్ , చింతా నాని , చింతా బోస్ బాబు , సతీష్ తదితర నాయకులు పాల్గొన్నారు





# ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలి

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్-చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి.

### ప్రేమావతిపేటలో ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలని అప్పుడే మానవుడికి మనశాంతి, ప్రశాంతత లభిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట్‌లో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున మహాపడి పూజలను నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, అంకరణ చేపట్టారు. 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలను స్వామి వారికి సమర్పించి మహాపడి పూజను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తీ గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వాములకు భిక్షను ఏర్పాటు చేయడంతో సన్నిదానం స్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

## రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్

### రాజేంద్రనగర్ మండల స్థాయి సీఎం క్రీడల పోటీలు ప్రారంభం





గండిపేట్(క్రైం మిర్రర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండల స్థాయి సీఎం క్రీడా పోటీలు శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంయెయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన శారీరకంగా, మానసికంగా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ఆటల వలన విద్యార్థులలో ఉన్న క్రీడా నైపుణ్యం వెలికి తీయడానికి దోహదపడుతుందన్నారు. నైపుణ్యం కనబరిచిన విద్యార్థుల ఎన్నిక చేసి జిల్లా స్థాయిలో ఆడడానికి పంపిస్తామన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాములు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రూపాదేవి, పాఠశాల జీహెచ్ఎం సుగుణ, జోనల్ ఇన్‌చార్జీ గంగ్యానాయక్, పాఠశాల అభివృద్ధి కమిటి అధ్యక్షులు పడమటి శ్రీధర్‌రెడ్డి, పిఆర్‌టియూటీఎస్ మండల అధ్యక్షులు సుదర్శన్, యూటీఎఫ్ అధ్యక్షులు యాదగిరి, ఎస్‌టిఎఫ్ అధ్యక్షులు జనార్ధన్‌చారి, పిడి రంగారెడ్డి, జ్యోతి, బాలస్వామిరెడ్డి, ప్రైవేటు పాఠశబూలల పీటీలు దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీలో ఎలాంటి పోరపాట్లకు తావివ్వం

## చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న



**గండిపేట్(క్రైం మిర్రర్):** సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీలో ఎలాంటి పోరపాట్లకు తావివ్వమని చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న వెల్లడించారు. గురువారం కాటేదాన్‌లోని స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమీషనర్ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా కొనసాగించించడం జరిగిందన్నారు. ఇందుకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లోని కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. సర్కిల్‌లోని అన్ని డివిజన్‌లలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో వచ్చిన ప్రతి ధరఖాస్తును డాటా ఎంట్రీ చేస్తున్నామన్నారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను చేపడుతున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పనులు జరుగుతున్నాయన్నారు. కొంత మంది వివిధ కారణాల వల్ల సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోలేదన్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేక కౌంటర్‌ను సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వచ్చిన ధరఖాస్తులను ఎప్పటికప్పుడు డాటా ఎంట్రీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబును అరెస్టు చేయాలి

### జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టా%శీ% తీసుకురావాలని

### ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు- కొండ శ్రీకాంత్ గౌడ్



**సంస్థాన్ నారాయణపూర్, డిసెంబర్ 12(క్రైమ్ మిర్రర్):** జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబును వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నారాయణపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో జర్నలిస్టులు రోడ్లపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ శ్రీకాంత్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా సినీ నటుడు మోహన్ బాబు ఇంటి వద్ద వార్త కవరేజ్ కి వెళ్ళిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. జర్నలిస్టులపై దాడి చేసి గాయపరిచిన మోహన్ బాబు వేషరతుగా జర్నలిస్టు సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కలకొండ సంజీవ, ఉపాధ్యక్షులు ఎస్కే పాషా, కార్యదర్శి గంగాపురం సాయి గౌడ్, కోశాధికారి ఉప్పల వెంకటేష్,పాలకూర యాదయ్య గౌడ్, చిలువేరు అంజయ్య, పందుల నరసింహా గౌడ్, కొండ శీను గౌడ్, చిలువేరు వీరేశం, చిలువేరు రమేష్, బాకారం నాగార్జున తదితరులు పాల్గొన్నారు

# అపరిష్కృతంగా ఉన్న కేసులను జాతీయ మెగా లోక్ అథాలత్‌లో పరిష్కరించుకోవాలి

## రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** అపరిష్కృతంగా ఉన్న కేసులను జాతీయ మెగా లోక్ అథాలత్‌లో పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు జరిగే జాతీయ మెగా ల్క అథాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పెట్టీ కేసులు(డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, మైనర్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలు జప్తు చేసిన కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు( ఎక్కువ ఛాలన్‌లు పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు సంబంధిత కేసులతో పాటు ఈ అథాలత్‌లో పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యభర్తల పంచాయతీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్ కేసులు, కోట్లాటలు, రోడ్ ఆక్సిడెంట్స్ కేసులు, పేకాట, ఎక్సైజ్ కేసులు, దొంగతనం కేసులు కూడా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చునన్నారు. పంతాలకు పోకుండా మానసిక ప్రశాంతత కోసం రాజి మార్గం ఉత్తమైందన్నారు.ప సమస్యలను సమస్యలుగా కాకుండా, పరిష్కారాల దిశగా ఆలోచన చేయాలని కోరారు. ఈ లోక్ అథాలత్‌ల కేసుల పరిష్కారం కోసం ఏవైనా సందేహాలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగాన్ని సంప్రదించాలని పాత కేసులను రాజీ చేసుకోని సహాయం పొందాలన్నారు.

# ఇది ప్రజాస్వామ్యమా..?రాచరికమా..?

### రైతు బిడ్డకి సంకెళ్లేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారు..!

### కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నమం...!

### రైతుకు సంకెళ్ల పై మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మండిపాటు..!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతికి బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ అన్నారు.గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ రైతుని రాజు చేస్తాను అని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకి బేడీలు వేసి హీనంగా చూస్తుందని చెప్పారు.అనారోగ్యంతో బాధపడుతున్న లగచర్ల రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకువెళ్లడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇంత కంటే దారుణం ఏముంటుందని ప్రశ్నించారు. రైతు హీర్యా నాయక్ ఉగ్రవాదా..? లేక దోపిడీ దొంగనా అని నిలదీశారు.ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం. ఇదేనా మీ ప్రజాపాలన అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ముమ్మాటికి మీది ప్రజా కంటక పాలన.. రైతు కంటక పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు.బంధిపోటు దొంగలకు, హంతకులకు వేసినట్టుగా రైతులకు బేడీలు వేయడంపై మనసును కలచివేసిందన్నారు.బేడీలు వేసి మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జాతీయ మానవహక్కుల కమిషన్ ఇప్పటికైనా లగచర్ల అంశంపై స్పందించి రైతులకు జైలు నుంచి విముక్తి కల్పించి రేవంత్ రెడ్డిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్ ఓ ప్లాంట్ టెండర్ పిలిచి పాత కాంట్రాక్టు కార్మికులనే విధుల్లోకి తీసుకోవాలి: దూలం శ్రీనివాస్

### సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు.




**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్ వో వాటర్ ప్లాంట్ టెండర్ పిలిచి పాత కార్మికుల్ని కొనసాగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియుగా డిమాండ్ చేస్తున్నాం. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ ఎస్సీ కేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ... శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పర్మనెంట్ కార్మికులకు, అధికారులకు శుద్ధమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో కృష్ణకాలనీ, నస్పూర్ ఏరియాలల్లో మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో వాటర్ సప్లై గా పనిచేయడానికి టెండర్ ద్వారా కాంట్రాక్టు కార్మికులను తీసుకోవడం జరిగింది. అయితే ఆ టెండర్ గడువు ముగిసి 7 నెలలు అవుతున్న, ఇప్పటివరకు కొత్త టెండర్ పిలవకుండా ఆ పాత కార్మికులకు పని కల్పించకపోగా, సివిల్ డిపార్ట్మెంట్ నుండి కాంట్రాక్ట్ కార్మికులను తీసుకువచ్చి పనిచేయడం దుర్మార్గమైన చర్య. తోటి కార్మికుల పొట్టలు కొడుతూ, వారు చేయాల్సిన పనిని కాకుండా వేరే సెక్షన్ నుండి తీసుకువచ్చి, సివిల్ కార్మికులతో పనిచేయిస్తున్న సివిల్ అధికారులు. సివిల్ కార్మికులతో ఆర్వో ప్లాంట్ లో పని చేయించేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇలాంటి చర్యలు చేస్తున్న కూడా సంబంధిత అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. వెంటనే ఏరియా సివిల్ డివైజయం గారు స్పందించి ఆర్వోప్లాంట్ టెండర్ను పిలిచి పాతకార్మికులతోనే విధులు నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలి,నిబంధనలకు విరుద్ధంగా సివిల్ కార్మికులతో పనిచేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకొని ఆర్వో ప్లాంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు తగిన న్యాయం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియుగా డిమాండ్ చేస్తున్నాం. లేనియెడల ఆ కార్మికులతో ఆందోళన, పోరాటాలకు సైతం సిద్ధమైతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి కాసీపేట రాజేశం, సురేష్, రాజు, వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# అలుపెరుగని నాయకుడు ఆర్ కృష్ణయ్య : కార్పొరేటర్ బిక్షపతి చారి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బీసీ సంఘం జాతీయ నాయకుడు ఆర్ కృష్ణయ్య ను భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన సందర్భంగా మీర్పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ బీసీల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న ఆర్ కృష్ణయ్య అలుపెరుగని నాయకుడని బిజెపి వలన బీసీలకు న్యాయం జరుగుతుందని గుర్తించిన ఆర్ కృష్ణయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, నీలం వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర మహిళా జాతీయ ఉపధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, మండల చందూ, కలకొండ శ్రీనివాస చారి, రామోజు భాస్కర్ చారి, సంపట్ల అనిల్ పాల్గొన్నారు.

# బి సి ల రాజ్యాధికార దిశగా ముందుకు సాగుతాం

### బి.సి రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్ ఓడ్డేపల్లి మనోహార్




**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** బి.సి రాజ్యాధికార సమితి మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఓడ్డేపల్లి మనోహర్ మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బి.సి రాజ్యాధికార సమితి యువజన జిల్లా కో-కన్వీనర్ గా పెద్దల్ల.శ్రీకాంత్ ని మరియు చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జి గా ఆవిడపు. గణేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బి.సి రాజ్యాధికార సమితి మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఒడ్డేపల్లి.మనోహర్ మాట్లాడుతూ బి.సి లు రాజ్యాధికారం పొందే దిశగా ఐక్యమత్యము కావాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీ లు వేస్తూ రానున్న ఎన్నికల్లో రాజ్యాధికారం పొందడం జరుగుతుందని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బి.సి రాజ్యాధికార జిల్లా యువజన కో-కన్వీనర్ పెద్దల్ల.చంద్రకాంత్ మరియు చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జి ఆవిడపు. గణేష్ మాట్లాడుతూ మాపై నమ్మకం, విశ్వాసం ఉంచి మాకు ఈ పదవి భాద్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బి.సి లు రాజ్యాధికారం సాధించేందుకు మావంతు సహకారం అందిస్తూ బి.సి లందరిని ఐక్యపరచుటకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల అధ్యక్షుడు వేముల. మల్లేష్,నాయకులు ఆవిడపు, శ్రీనివాస్, బిరుదు. పొశం తో పాటుగా తదితరులు పాల్గొన్నారు



# తాత్కాలికంగా ధరణి పోర్టల్ సేవలకు అంతరాయం

### ప్రజలు కార్యాలయం సిబ్బందికి సహకరించగలరు

### తహసిల్దార్ గూగులోత్ దేవసింగ్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కార్యక్రమం నిర్వహిస్తున్న కారణంగా ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో లేకపోవడం ప్రజలందరికీ తెలియజేయు విషయం డేటాబేస్ వెర్షన్ అప్డేట్ కార్యక్రమం గురువారం 12-12-2024 రోజు సాయంత్రం ఐదు గంటల నుండి 16 -12-2024 ఉదయానికి ముగిసే అవకాశం ఉందని ఈ మధ్యకాలంలో ధరణి పోర్టలు సేవలు అందుబాటులో ఉండవని తెలియజేస్తూ ధరణి పోర్టల్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చేవరకు కార్యాలయ సిబ్బందికి ప్రజల సహకరించగలరని నాంపల్లి తహసిల్దార్ గూగు లోతు దేవ సింగ్ ఒక ప్రకటన ద్వారా కోరారు.

# పేకాట పై ఉక్కు పాదం : సిఐ రాము, ఎస్సై రంజిత్ రెడ్డి

**కోదాడ డిసెంబర్ 12 క్రైమ్ మిర్రర్:** ఉదయం కోదాడ లోని కట్టకొమ్ముగూడెం రోడ్ లోని ధరావత్ శ్రీనివాస్ నివాసం లో ప్రభుత్వ నిషేదిత " అందర్- బాహర్ " పేకాట ఆడుతుండగా పట్టణ CI Tరాము కి అందిన నమ్మదగిన సమాచారం మేరకు కోదాడ టౌన్ SI A. రంజిత్ రెడ్డి, సిబ్బంది తో వెళ్ళి రైడ్ చేసి అట్టి నివాసం నందు పేకాట ఆడుతున్న 1) వేముల నాగేశ్వర్ రావు, 2) పీడమర్తి రవీందర్ 3) ఊదర బాబు, 4) బచ్చలకూరి వెంకటేశ్వర్లు, మరియూ 5) గుంజ పిచ్చయ్య అనే వారిని పట్టుబడి చేసి పంచనామా నిర్వహించి వారి వద్ద నుండి మొత్తం రూ. 26,680/- నగదు, (5) మొబైల్ ఫోన్లు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లుగా కోదాడ పట్టణ %జ× ు%. రాము పత్రికా ప్రకటనలో తెలిపినారు.



# సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని ఆదుకోవాలి.....

### రవాణా రంగ సమస్యలపై పార్లమెంటులో చర్చించాలి....

### మాజీ సీఎం, ప్రస్తుత ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్ కు వినతి పత్రం అందజేత........

**కోదాడ డిసెంబర్ 12 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు..........దేశవ్యాప్తంగా రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు కోదాడకు వచ్చిన త్రిపుర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్ కు వినతిపత్రం అందించి సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, టోల్గేట్ ధరలతో రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. 15 సంవత్సరాల కలపరిమితి తర్వాత వాహనాలను రద్దు చేయడంతో చిన్న, చిన్న యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెట్రోల్,డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని అన్ని సమస్యలపై పార్లమెంటులో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కోదాడకు వచ్చిన సందర్భంగా వారిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో వారి వెంట డాక్టర్ బ్రహ్మం, కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, పత్తిపాక జనార్దన్ తదితరులు పాల్గొన్నారు........




క్రైమ్ THE మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

## బ్యాడ్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్.. ఇప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్

ఇతర రంగాలకు కాస్త భిన్నం సినిమా రంగం. ఇక్కడు ఎవరు ఎప్పుడు అందలం ఎక్కుతారో చెప్పలేం. అసలు వారు కూడా ఊహించలేరు. తన పరిస్థితి అంతేనంటోంది నటి మీనాక్షి చౌదరి. ఈ కన్నడ భామలో అందం, అభినయం ఉన్నా, అదృష్టం మాత్రం కాస్త ఎక్కువే అని చెప్పక తప్పదు. టాలీవుడ్‌లో వర్ధమాన హీరోలతో నటిస్తూ మంచి పేరు తెచ్చుకున్న ఈమెకు ఒక్క సారిగా స్టార్ హీరోలతో నటించే అవకాశాలు రావడం మొదలెట్టాయి. అలా ఆమె నటించిన తొలి భారీ చిత్రం గుంటూరు కారం. మహేశ్‌బాబు హీరోగా నటించిన ఈ చిత్రం కమర్శియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. అదే విధంగా తమిళ చిత్ర పరిశ్రమకు కొలై అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. అయినప్పటికీ నటుడు విజయ్ సరసన గోట్ చిత్రంలో నటించే అవకాశం వరించింది.

## ప్రెగ్నెన్సీ వార్తలపై క్లారిటీ ఇచ్చిన సోనాక్షి సిన్హా!



ఈ ఏడాది పెళ్లి బంధంలోకి అడుగుపెట్టిన బాలీవుడ్ ముద్దుగుమ్మ సోనాక్షి సిన్హా. తన ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ను పెళ్లాడింది. దాదాపు ఏడేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఈ జంట జూన్‌లో ఒక్కటయ్యారు. ఆ తర్వాత ఎక్కడికెళ్లినా సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేస్తోంది బాలీవుడ్ భామ. దీంతో నెటిజన్స్ ఆమె డ్రెస్సింగ్ స్టైల్‌ను చూసి క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. సోనాక్షి త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పబోతోందని నెటిజన్స్ పోస్టులు పెడుతున్నారు. అంతేకాదు ఆమె ప్రెగ్నెంట్ అంటూ రూమర్స్ కూడా తెగ వైరలవుతున్నాయి.ఈ సందర్భంగా తనపై వస్తున్న ప్రెగ్నెన్సీ వార్తలపై స్పందించింది సోనాక్షి. ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముద్దుగుమ్మ ప్రెగ్నెన్సీపై క్లారిటీ ఇచ్చింది. తాను ప్రస్తుతం గర్భవతిని కాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం మేమిద్దరం సరదాగా విదేశీ పర్యటనలకు వెళ్తున్నామని చెప్పింది. పెళ్లి తర్వాత తాను కొంత బరువు పెరగడంతో పాటు లావుగా కనిపిస్తున్నట్లు వెల్లడించింది. అందువల్లే తనను గర్భవతి అంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారని వివరించింది. ప్రస్తుతం తామిద్దరం వేకేషన్ ఎంజాయ్ చేస్తున్నామని సోనాక్షి తెలిపింది కాగా.. తన భర్త బర్త్ డే గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంది బాలీవుడ్ హీరోయిన్. డిసెంబర్ 10న జరిగిన జహీర్ ఇక్బాల్ పుట్టిన రోజు వేడుకలో సోనాక్షి తండ్రి శతృఘ్న సిన్హా కూడా హాజరయ్యారు. ఈ ఏడాది జూన్ 23న ఒక ప్రైవేట్ వేడుకలో వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి ఇరు కుటుంబాలు, సన్నిహితులు హాజరయ్యారు. వీరిద్దరి రిసెప్షన్ వేడుకలో రేఖ, సల్మాన్ ఖాన్, అదితి రావ్ హైదరీ, హుమా ఖురేషి, ఆదిత్య రాయ్ కపూర్ పాల్గొన్నారు.



## సెట్‌లో అనారోగ్యంతో.. ఆ హీరో ఎంత కేర్ తీసుకున్నాడో!

అల్లు అర్జున్ 'పుష్ప 2' మూవీతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది రష్మిక మందన్నా. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో కుబేర, చావ, సికిందర్, ద గర్ల్‌ఫ్రెండ్, థామ సినిమాలున్నాయి. ఇకపోతే సికిందర్ సినిమా విశేషాలను తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది రష్మిక.ఆమె మాట్లాడుతూ.. సల్మాన్ ఖాన్‌తో నటించడమనేది గొప్ప విషయం. ఆయన చాలా ప్రత్యేకమైన వ్యక్తి. అలాగే ఎంతో హుందాగా ఉంటాడు. ఒకసారి నాకు ఆరోగ్యం బాగోలేదు. అయినా షూటింగ్‌కు వెళ్లాను. నా పరిస్థితి తెలిసిన సల్మాన్ సర్ ఎలా ఉంది? అంతా ఓకేనా? అని ఆరా తీశాడు.

స్పెషల్ కేర్

మంచి హెల్తీ ఫుడ్, వేడి నీళ్లు అన్నీ ఏర్పాటు చేయమని అక్కడున్నవారికి చెప్పాడు. నన్ను చాలా బాగా చూసుకున్నాడు. స్పెషల్ కేర్ చూపించాడు. దేశంలోనే బడా స్టార్స్‌లో ఒకరైనప్పటికీ ఎంతో అణుకువతో ఉంటాడు. సికిందర్ నాకెంతో స్పెషల్ మూవీ. ఈ సినిమా కోసం ఎంతో ఎగ్జయిట్‌గా ఉన్నాను అని రష్మిక చెప్పుకొచ్చింది.







Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.

## రాయలసీపై అల్పపీడన ప్రభావం

### చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు

### స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించిన కలెక్టర్



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షంతో శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ రోడ్డులో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని టీటీడీ అధికారులు సూచించారు. కొండచరియలు విరిగేపడే ప్రమాదం ఉండడంతో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది సూచించారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. తిరుమల గోగర్భం, పాపవినాశనం జలశయాలు పూర్తిగా నిండటంతో నీరు ఔట్ ఫ్లో అవుతోంది. బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం శ్రీలంక తీరంలో నైరుతి బంగాళాఖాతం మీదుగా పయనిస్తోంది. ఉంది దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా శ్రీలంక-తమిళనాడు తీరాల వైపు కదులుతూ కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. అల్పపీడన ప్రభావంతో డిసెంబర్ 12, గురువారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల అనంతపురం, శ్రీ సత్య సాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఎజయవాడ మీదుగా బెంగళూరుకు ప్రత్యేక రైలు

# ఏపీలో చాలా మంది అనర్హులకు పెన్షన్

### అనర్హుల నుంచి పెన్షన్ రికవరీ చేయండి

### ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్ అణుబాంబు పేలేలా కనిపిస్తోంది. ప్రభుత్వం పెన్షన్ విషయంలో చాలా సీరియస్‌గా ఉంది. అనర్హులను పెన్షనర్ల జాబితా నుంచి తొలగించడమే కాదు.. వారికి ఇచ్చిన పెన్షన్ డబ్బులను కూడా వెనక్కి తీసుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో చాలా మంది అనర్హులు పెన్షన్ తీసుకుంటున్నారన్న చంద్రబాబు.. ఇందుకోసం బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చారనీ, ఇలాంటి సర్టిఫికెట్లతో పెన్షనర్లుగా జాబితాలో చేరి, అక్రమంగా పెన్షన్ మనీ పొందుతున్నారని అన్నారు. ఇలాంటి వాళ్లందరి దగ్గరా పెన్షన్ మనీని రికవరీ చెయ్యాలని అధికారులకు చెప్పారు. సీఎం చంద్రబాబు మరో మాట కూడా అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లపై చట్టపరంగా చర్యలు (ప్రాసిక్యూట్) తీసుకోవాలి అని అన్నారు. ప్రత్యేకంగా కొన్ని ఆస్పత్రుల నుంచే బోగస్ సర్టిఫికెట్లు వస్తున్నాయన్న చంద్రబాబు.. అలాంటి ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. మెడికల్ బోర్డుల నుంచి బోగస్ సమర్టిఫికెట్లు ఇస్తున్నారన్న చంద్రబాబు.. ఈ మొత్తం వ్యవస్థను సరిచెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనర్హులైన పెన్షనర్లను గుర్తిస్తుంది. వారిని



పెన్షనర్ల జాబితా నుంచి తొలగిస్తుంది. ఈ కార్యక్రమం మార్చి 31, 2025 నాటికి పూర్తవుతుంది. ఇలా అనర్హులై, బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి పెన్షన్ పొందిన వారిని గుర్తించడమే కాదు.. వారు తిరిగి ఆ పెన్షన్ మనీని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించే అవకాశాలు ఉన్నాయి.

అందువల్ల అనర్హులకు ఇకపై టెన్షన్ తప్పదు. వారు తిరిగి మనీ చెల్లించాలంటే.. వారికి ఎక్కడి నుంచి వస్తుంది? ఇది పెద్ద దుమారం రేగేలా ఉంది. అనర్హులు.. బోగస్ సర్టిఫికెట్లు ఇస్తే.. మరి అధికారులు ఎలా ఆమోదించారు? ఆ సర్టిఫికెట్లను పరిశీలించి, అవి బోగస్‌వి అని ఎందుకు గుర్తించలేదు? అధికారులు చేసిన తప్పు వల్ల.. ఇప్పుడు అనర్హులు పెన్షన్ పొందుతున్నట్లు అవుతోంది. ఇప్పుడు వారి నుంచి మనీ రికవరీ చెయ్యాలని ఆదేశిస్తే, అప్పుడు.. బోగస్ సర్టిఫికెట్లను ఆమోదించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అధికారులు అనర్హులకు పెన్షన్లు ఇచ్చారని కూటమి ప్రభుత్వం అంటోంది. మరి అప్పటి అధికారులు ఎందుకు అనర్హులకు పెన్షన్ ఇచ్చారో, ఎందుకు అనర్హులను, అర్హులుగా గుర్తించారో చెప్పాలి. ఎందుకంటే.. ఇది పెద్ద స్కామ్ లాగా కనిపిస్తోంది. 63 లక్షల మందిలో ఎంత మంది అనర్హులు ఉన్నారో తేలాలి. వారికి ప్రతీ నెలా అక్రమంగా మనీ పోతున్నట్లే. అదంతా ప్రజల డబ్బు. అక్రమంగా, అన్యాయంగా అనర్హులకు ఇవ్వడం సరైనది కాదు. అయితే, అనర్హులను అర్హులుగా చేసిన పాపం అధికారులది. కాబట్టి.. అసలు తప్పంతా అధికారుల దగ్గరే ఉన్నట్లు లెక్క. చర్యలు తీసుకుంటే వారిపై తీసుకోవాలి. ప్రజలపై కాదనే వాదన ఉంది. మొత్తంగా పెన్షన్ల వ్యవహారం ఇప్పుడు ఏపీలో పెను దుమారం రేపుతోంది. జనవరిలో ఎంతమందికి పెన్షన్ వస్తుందో, ఎంతమందికి కట్ అవుతుందో అనేది హాట్ టాపిక్ అయ్యింది.

## లబ్దిదారులకు సొంత జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలు

### హడ్కో నుంచి మరో రూ.12వేల కోట్ల రుణం

### అమరావతిలో ఆర్5 జోన్ పై సీఆర్‌డిఏ కీలక ప్రకటన

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అమరావతిలో వైసీపీ ప్రభుత్వ హయంలో సీఆర్డిఏ మాస్టర్ ప్లాన్‌లో చేర్చిన ఆర్5 జోన్ పై కలెక్టర్ల సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ స్పష్టత ఇచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన జగనన్న ఇళ్ల స్థలాల లబ్దిదారులకు వారి సొంత జిల్లాల్లోనే ఇంటి స్థలాలు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఎన్టీర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు సహకరించాలని కోరారు. భూములను ఎంపిక చేస్తే సీఆర్డీఏ నిధులు సమకూరుస్తుందన్నారు. రాజధానికి సంబంధించిన 15 వేల కోట్ల రుణాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు తమ బోర్డు మీటింగ్ లో క్లియర్ చేసిందని, డిసెంబరు 19 తేదీన ప్రపంచబ్యాంకు బోర్డు కూడా అమరావతి రుణంపై నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. జనవరి నాటికి 31 వేల కోట్ల రుణం అమరావతి నిర్మాణానికి అందుబాటులోకి వస్తుందన్నారు. జూన్ లో సీఎం చంద్రబాబు పర్యటన తర్వాత రాజధాని నిర్మాణంపై రోడ్ మ్యాప్ ఇచ్చారని, గడచిన మూడు నెలల్లో ధ్వంసమైన పరిస్థితుల్ని గాడిన పెట్టగలిగామన్నారు. గడచిన ఐదేళ్లలో పనులు ఆగిపోయాయి, చాలా మెటీరియల్ దొంగిలించారని వివరించారు. రహదారులను కూడా తవ్వేశారని, యంత్రాలు కూడా పాడైపోయాయని చెప్పారు. మొత్తంగా అంతా ధ్వంసమైన పరిస్థితి అక్కడి నుంచి మొదలు పెట్టి పునర్నిర్మాణం దిశగా అడుగులేస్తున్నట్టు వివరించారు. రాజధాని పునర్నిర్మాణంపై ఇంజనీర్లు, ఐఐటీ చెన్నై, హైదరాబాద్ నిపుణులతో అధ్యయనం చేయించి ఓ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేశామని, ఇప్పుడు కొత్త పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేయగలిగామన్నారు. రూ.20,500 కోట్ల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు కూడా తీసుకున్నట్టు తెలిపారు. హడ్కో కూడా మరో రూ. 11 వేల కోట్లు కూడా రుణం ఇచ్చేందుకు ఆమోదం తెలిపిందని మొత్తంగా 31 వేల కోట్ల రూపాయల మేర రుణం రాజధాని నిర్మాణాలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కీలకమైన నిర్మాణాలతో పాటు రైతులకు ఇచ్చే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లే అవుట్ లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు కూడా ఈ నిధులతోనే పూర్తి చేస్తామన్నారు. రాజధానిలో పనుల్లో మానవ వనరులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కూడా ప్రపంచబ్యాంకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్ 5 జోన్ కారణంగా మాస్టర్ ప్లాన్ లో ఇబ్బందులు వచ్చాయని, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలోని లబ్దిదారులకు ఆయా జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. లబ్దిదారులకు స్థలాలు ఇచ్చేందుకు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు ముందుకు రావాల్ ఉందన్నారు. ఇళ్ల స్థలాల కోసం డీపీఆర్ లు సిద్ధం చేస్తే అందుకు అనుగుణంగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అమరావతిలో పేదలకు ఇంటి స్థలాలను కేటాయించడంతో పాటు లే ఔట్ అభివృద్ధి చేయడంపై రైతులు కోర్టును ఆశ్రయించారు. 50వేల మందికి ఇంటి పట్టాలు కూడా జగన్ చేతులు మీదుగా జారీ చేశారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఇళ్లు లేని వారికి అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించారు.

## జయవాడ మీదుగా బెంగళూరుకు ప్రత్యేక రైలు

### నెల పాటు ఎనిమిది స్పెషల్ రైళ్ల పొడిగింపు

### ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ నిర్ణయం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అదనపు రద్దీని క్లియర్ చేయడానికి ఎస్ఎంవీబీ- హౌరా మధ్య విజయవాడ మీదుగా స్పెషల్ రైలు అందుబాటులోకి తెచ్చారు. ఎస్ఎంవీబీ బెంగళూరు నుంచి బయలుదేరే స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను (08565) రైలు అందుబాటులోకి తెచ్చారు. ఈ రైలు డిసెంబర్ 14 (శనివారం)న ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీబీ బెంగళూరులో బయలుదేరుతోంది. ఈ రైలు మరుసటి రోజు ఆదివారం రాత్రి 9.45 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంట, గూడూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం, పలాస తదితర స్టేషన్లలో ఆగుతోంది. ఈ రైలుకు థర్డ్ ఏసీ-2, స్లీపర్ క్లాస్-9, సెకండ్ క్లాస్ లగేజ్ కమ్ గార్డ్/ దివ్యాంగజన్ కోచ్ - 2 ఉంటాయి. ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి ప్రత్యేక రైళ్లను పొడిగించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. కొచ్చువేలి (త్రివేండ్రం నార్త్) - షాలిమార్ ప్రత్యేక (06081) రైలు డిసెంబర్ 20 నుంచి జనవరి 24 వరకు అందుబాటులో ఉంటుంది. షాలిమార్ - కొచ్చువేలి (త్రివేండ్రం నార్త్) ప్రత్యేక (06082) రైలు డిసెంబర్ 23 నుండి జనవరి 27 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ రెండు రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి. తిరునెల్వేలి%-% షాలిమార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (06087) రైలు డిసెంబర్ 19 నుంచి జనవరి 23 వరకు అందుబాటులో ఉంటుంది. షాలిమార్ - తిరునెల్వేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (06088) రైలు డిసెంబర్ 21 నుండి జనవరి 25 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, పలాస తదితర స్టేషన్లలో ఆగుతాయి. పోదనూరు - బరౌని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (06055) రైలు డిసెంబర్ 21 నుండి జనవరి 25 వరకు అందుబాటులో ఉంటుంది.

# రాజధాని అభివృద్ధికి అడుగులు

### ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు

### అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా మార్చేందుకు నిధులు

### వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణాలకు వెసులుబాటు

### వెసులుబాటు కల్పిస్తూ కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** రాజధాని అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు చేసింది. అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి రుణం మంజూరు చేసినట్టు ఏడీబీ స్పష్టం చేసింది. మొత్తం 121.97 బిలియన్ల జపనీస్ యెన్‌లను మంజూరు చేసినట్టు ఏడీబీ వెల్లడించింది. రాజధాని నిర్మాణానికి నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిధులు సమకూర్చుకునేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణం తీసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ.. కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. రూ. 15,000 కోట్లలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ కలిసి రూ. 13,500 కోట్లను రుణంగా ఇస్తున్నాయి. మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. రూ. 13,500 కోట్ల రుణాన్ని ఐదేళ్లపాటు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఐదేళ్ల తర్వాత చెల్లింపు మొదలవుతుంది. ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాలపాటు రుణం చెల్లించాలి. నిధులతో ప్రభుత్వం కీలక పనులు చేపట్టనుంది. అమరావతి ప్రాంతాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడానికి, ఆ ప్రాంత వాసుల జీవన ప్రమాణాలు పెంచడానికి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు మేలు చేయడానికి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులను ప్రభుత్వం వినియోగించనుంది.ఈ రుణం మంజూరుపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇండియా కంట్రీ డైరెక్టర్ మియో ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులోను మరిన్ని నగరాల అభివృద్ధి జరగబోతోందని.. వాటికి అమరావతి రోల్ మాడల్‌లో మారబోతోందని వ్యాఖ్యానించారు.గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా.. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. పచ్చని ప్రదేశాలు ఉండేలా చూస్తారు. నీరు, పారిశుద్ధ్య సేవలు, తక్కువ కార్బన్ రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. వరద ప్రమాదాలను తగ్గించడానికి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తారు. పెట్టుబడిదారులను తీసుకురావడంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తారు. ప్రైవేట్ పెట్టుబడిని సృష్టించి మహిళలు, యువతకు ప్రయోజనం చేకూర్చే కొత్త ఉద్యోగాలను సృష్టిస్తారు.

## జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్ పై దృష్టి సారించాలి

### కలెక్టర్లకు మంత్రి నారా లోకేశ్ ఆదేశం

### అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారులంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. “ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి. ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం. అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు.

## అమెరికాలోని టెక్సస్ లో హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్

### కుప్పకూలిపోయి రెండు ముక్కలైన విమానం

టెక్సాస్,డిసెంబర్ 12(ఆర్ఎన్ఎ): అమెరికాలో దక్షిణ టెక్సాస్ హైవేపై బుధవారం ఓ చిన్న ట్విన్ ఇంజిన్ ప్రొపెల్లర్ విమానం మూడు కార్లను ఢీకొట్టింది. ఆ విమానం హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ప్రయత్నించిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఒక చిన్న విమానం దక్షిణ టెక్సాస్ హైవేపై క్రాష్ ల్యాండింగ్ కు ప్రయత్నించింది. అంతకు ముందు తక్కువ ఎత్తులో ఎగురుతూ, రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీ కొట్టింది. అనంతరం హైవే పై ఉన్న ఒక బ్రిడ్జిని ఢీ కొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆ చిన్న విమానం రెండు ముక్కలైంది. విమాన శకలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడడంతో ఆ హైవే పై భారీగా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.టెక్సాస్ లోని విక్టోరియాలోని స్టేట్ హైవే లూప్ 463పై మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా, ముగ్గురికి ప్రాణాపాయం తప్పింది. నాలుగో వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక కేంద్రానికి తరలించారు. హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ముందు విమానం తక్కువగా ఎగురుతూ పలు వాహనాలను ఢీకొట్టింది. విమానం ప్రమాదానికి ముందు రోడ్డుపైకి దిగుతున్న దృశ్యాలను సోషల్ మీడియా ఫుటేజీలో చిత్రీకరించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, పలువురికి గాయాలయ్యాయని విక్టోరియా పోలీస్ డిపార్ట్ మెంట్ డిప్యూటీ పోలీస్ చీఫ్ ఎలిన్ మోయా తెలిపారు. ఎమర్జెన్సీ రెస్పాండెంట్స్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం చేసి శిథిలాలను తొలగించారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు దారితీసిన సంఘటనలను క్రోడీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్టీఎస్బీ)కి సమాచారం అందించి మరింత లోతుగా దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు. ఆ విమానం క్రాష్ ల్యాండ్ కావడాన్ని కొందరు వాహనదారులు తమ స్మార్ట్ ఫోన్స్ లో చిత్రించి, సోషల్ మీడియా లో పోస్ట్ చేశారు. విమానం అకస్మాత్తుగా దిగడం, తరువాత కూలిపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని సాక్షులు వర్ణించారు.